


వజ్ఝల కాళిదాసు, (ఆం. గీ. సా. ప.)

ఆ కత్తిరింపు జుట్టూ, ఆ ఫంట్లాం, ఆ మెడ క్రింది భాగాన్ని కనబరుస్తూన్న చొక్కా, ఆ చూపుల్లో దుడుకుతనం, ఆ బుగ్గలమీద ఎరుపూ అన్నీ ఆమెకి లేని సౌందర్యం తెచ్చిపెడుతూవుంటే ఆమె చెమక్ చెరక్ మని నడుస్తూన్నప్పుడు ప్లాటు ఫారంమీద కళ్లన్నీ ఆమె వేపు విడ్డూరంగా తిరిగేయి. అబలా సహజమైన మందగమనం ఆమెకి లేనేలేదు; ఆడవారికి వుండవలసిన నాజూకుమాత్రం ఆమెలో ప్రస్ఫుటం. అలాంటప్పుడు వాల్తేరు స్టేషన్లోవున్న జనం అంతా ఆమెవేపు చూచేరంటే చూడరూ మరి?

సుదర్శనం సిగరెట్లు కొంటూవుంటే అతన్ని తాకుతూనే ఆమె ఇటూ అటూ రెండు మార్లు పచారు చేసింది. తనుకూడా సిగరెట్టు డబ్బా కొంది. అతను మొదట కంగారు పడ్డాడు; తర్వాత ఆమె వెనకే తనూ—ఊసుపోనట్టు—నడిచేడు.

మెయిలు కదిలేవేళకి ఆమె ఒక ఫస్టుక్లాసు కంపార్టుమెంటులోకి ఎక్కింది. ఆమె వెనకే సుదర్శనంకూడా ఎక్కేడు.

ఆమె కూర్చున్న సోఫా కెదురుగానే అతనూ కూర్చున్నాడు. ఆమె ఎదురుగుండా వున్న కిటికీలోంచి దూరాన్నవున్న పొలాల్లో పనులు చేసుకొనే పల్లె పడుచుల్ని చూస్తూంది; అతని వేపేనా కన్నెత్తి చూడలేదు.

పది నిముషాలవరకూ అతను పత్రికలో నిమగ్నుడైనట్టు నటించేడు, కాని తుదకి ధైర్యం చేసి ఆమెవేపు చూచేడు. ఆమె మెడకింద కనబడుతూన్న వంపూ, నిగనిగా, తెల్లదనం అతన్ని వెఱ్ఱెత్తించేయి. ఆ మగవేషంలో కూడా ఆమె ఎంతో అందంగా వుంది.

పది నిముషాలు దాటేయి.

ఆమె ఏదో జ్ఞాపకం తెచ్చుకున్నట్టు లేచి, సూట్ కేసులోంచి అగ్గిపెట్టె తీసి ఆడించింది. రెండు పుల్లలు మాత్రం కదిలిన శబ్దం అయింది. అగ్గిపుల్ల తీసి వెలిగించిం దామె. భగ్ మని వెలిగి గాలి కారిపోయింది. కొంచెం చిరాకుతో కిటికీల అద్దాలు మూసి రెండో అగ్గిపుల్ల తీసింది. దానికి మందు లేదు. ఛట్ ని అగ్గిపెట్టె విసిరేసింది.

"మీా దగ్గర అగ్గిపెట్టె వుందా?" అని ఆమె అతన్ని చక్కని తెలుగులో ప్రశ్నించింది.

అతను గాభరా పడ్డాడు. అగ్గిపుల్ల వెలిగించి దోసిట్లో పట్టుకుని ఆమెవేపు చేతులు ఎత్తేడు. పెదిమల్తో సిగరెట్టు నొక్కి వుంచే చిన్న నవ్వు నవ్వి అతని ముఖంకేసి చూచి, ఆమె సిగరెట్టు ముట్టించింది. ఆమె నున్నని

రెండు బుగ్గలూ అతని రెండు బొటన వ్రేళ్లకీ తగిలేయి. ఆమె పీల్చి వదిలిన పొగ అతని నాసికలో సువాసన జల్లింది.

తను పవిత్రుడైనట్టు తల్చుకున్నాడు సుదర్శనం. ఇంక మాట్లాడటానికి అవకాశం దొరికినందుకు అతను సంతోషించేడు.

"మీరు తెలుగు మాటాడగలరే" అన్నాడు, ఆమె తన తెలుగు పరిచయంగురించి విశదంగా చెబుతుందని ఊహించి.

"ఔను" అని జవాబిచ్చిందామె; అంతే, కాని మరి ఏమీ అనలేదు.

అతనికి కోపం వచ్చింది ఆమె మొండితనం చూచి; అయితే మాత్రం ఏం చెయ్యగలడు?

"మీ దేవూరు?" అని మళ్లా ప్రశ్నించేడు.

"ఆఁ...మాది...మాదీ...ఏవూరని చెప్పను? నే నెప్పుడూ ఒకచోట వుండను. అలా తిరుగుతూ వుంటాను..."

"అసలు మీ జన్మస్థలం ఏది?"

"అమెరికా దేశం."

"............"

"............"

ఆమె ఏమేనా ఇంకా చెపుతుందనుకున్నాడు, కాని ఉఁహూఁ! ఆమె మరి మాటాడకుండా వూరుకుంది. అతనుమాత్రం వూరుకోదల్చుకోలేదు.

"మీరు హిందూదేశం వచ్చి ఎన్నాళ్ళయింది?" అన్నాడు.

"ఐదు సంవత్సరాలైంది."

"తెలుగేనా మరే భాషకూడా వచ్చునా మీకు?"

"హిందీ, అరవం, ఇంగ్లీషుకూడా వచ్చును."

ఇంక సంభాషణ ఎలా పొడిగించడవో అతనికి అర్థం కాలేదు.

"మీ పేరేమిటి......"

"లిలీ...లిలి డాసన్ నా పేరు."

"మీ...మీ...కూ...మీగూ..." అతనికి నోరు తిరగలేదు.

"నా కింకా పెళ్లి కాలేదు...నేను కన్యని..." అన్నది ఆమె వస్తూన్న నవ్వాపుకొని.

"............"

"మీరు పత్రికా విలేఖరులా?" అని ఆమె ప్రశ్న.

"కాను! ఏమలా అడిగేరు?"

"అఁహా! నన్ను గురించి అంతలా భోగట్టా చేసేరు కదా అని. చూడండి నన్నుగూర్చి మీ కేమంత అవసరం అన్ని ప్రశ్నలు వేశారు. మీరు పత్రికా విలేఖరులేమో అని నాభయం. కాదు కాబట్టి మీకు నా సంగతంతా చెప్తాను ...వినండి."

అతని కళ్ళల్లో కొంటెతనం మెరిసింది. ఆమె సిగరెట్టు కొత్తది తీసింది. అతను అగ్గిపుల్ల వెలిగించి అందించాడు.

నాల్గు నిముషాలు ఎవరూ మాటాడలేదు. ఆమె మెల్లిగా ఇలా చెప్పింది:

"ఐదేళ్ళ కిందట నేనూ మీలాగే పురుషుణ్ణే. అప్పటికి నాకు ఇరవై ఏళ్లు. ఒక్కమారుగా నాలో స్త్రీత్వం కనబడడం ప్రారం

భించింది. నా దేశంలో నేను ఎంతో హాయిగా ముద్దులాడిన స్త్రీలలో ఒక స్త్రీగా నేనూ కలిసి పోయి వుండడం నాకు ఎంతో సిగ్గయింది... నాతో చదువుకున్న కుర్రాళ్ళ అపహాస్యాలూ ప్రేమ దృష్టులూ నన్ను హిందూదేశం తగిలి వేశాయి...నా ఆస్తి పదివేల డాలర్లూ పట్టుకొని ఈదేశం చేరుకున్నాను. ఇక్కడ అందరూ నన్నూ నా వేషాన్నీ ఆశ్చర్యంతోనూ గౌరవంతోనూ చూస్తున్నారు. నా బంధువులెవరూ నాకోసం ప్రయత్నించలేదు. నాకు తలిదండ్రులు మొదటే లేరు......"

మూడు నిముషాలు ఆమె శూన్యంగా కిటికీలోంచి చూచింది.

"నే నీదేశం వచ్చిన రెండు సంవత్సరాలు ఎవరికీ తెలీకుండా పల్లెల్లో వున్నాను. అప్పట్లో పత్రికలూ పుస్తకాలూ నాకు స్నేహితులు. తర్వాత మద్రాసులో ఒక సంవత్సరం వున్నాను......ఇప్పుడు కలకత్తా వెళ్తున్నాను..... ఇదివర కెందరో నాతో ప్రయాణం చేసేరు. మీలాగ ఎవరూ మాటాడలేదు. కాబట్టి మీకు నాసంగతి చెప్పేను......మిమ్మల్ని నేటినుంచీ నాకు స్నేహితులుగా భావిస్తాను.

వారి చేతులు రెండూ కలిసేయి.

---


కలకత్తా, పూనా, మైసూరు, తిరుచ్చూరు మొదలైన పలు యెగ్జిబిషన్లలో బంగారు పతకములు బహుమానము పొందిన

మదరాసు పి. వి. రాజన్ అండు కంపెనీవారి శ్రేష్ఠమయిన




## మదరాసు ముక్కుపొడి

ఘాటు, కమ్మదనం, సువాసన అన్నిటిలో ప్రసిద్ధి అయినది. చాలా రోజుల పర్యంతం ఘాటు కమ్మదనం అట్లే వుండును. ఒక్కసారి వుపయోగించిన వారికి యథార్థము తెలియగలదు. మా పొడుము యొక్క శ్రేష్ఠతను గురించి పలుచోట్లనుండి సర్టిఫికెట్లు వచ్చియున్నవి. దీనినే వుపయోగించి ఆనందించ కోరెదము. రకంవారి టిన్నులలో ప్యాకింగ్ చేసి అమ్మబడుచున్నది.

డబ్బా తీసేటప్పుడు లేబిలులో మాపేరు చూసి ఖరీదు చేయవలెనని హెచ్చరించుచున్నాము. దీనినే వుపయోగించండి.

తయారుచేసేవారు: అన్ని షాపులలోను దొరుకును.

**పి. వి. రాజన్ అండు కంపెని,**

**R. S.** సుగంధ ముక్కుపొడి ఫ్యాక్టరీ,

**44,** గోవిందప్ప నాయక్ వీధి, జి. టి., మదరాసు.

తంతి విలాసం: "నస్యం" "**Nasyam**"